సాక్షి
వరంగల్
గురువారం । 3 । జూలై । 2025



ఇక వినియోగంలోకి..
టీజీ ఎన్పీడీసీఎల్‌లోని అన్‌యూజ్డ్ పోస్టులకు మోక్షం లభించింది. అవసరం లేని 216 పోస్టులను రద్దు చేస్తూ రాష్ట్ర ఆర్థిక శాఖ ఆమోదం తెలిపింది. - 8లో▸



కేటీఆర్ జైలుకెళ్లడం ఖాయం
కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్ కేసులతో కేసీఆర్, కేటీఆర్ జైలుకెళ్లడం ఖాయమని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
30^0 / 24^0

వాతావరణం
జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం వేళ సాధారణంగా ఉంటుంది. సాయంత్రం సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుంది.

న్యూస్‌రీల్

చెత్తను తొలగించాలి



నర్సంపేట రూరల్: గ్రామంలో చెత్తాచెదారాన్ని వెంట వెంటనే తొలగించాలని జిల్లా పంచాయతీ రాజ్ అధికారి కల్పన ఆదేశించారు. మండలంలోని రాజుపేట గ్రామాన్ని డీపీఓ బుధవారం తనిఖీ చేశారు. పారిశుద్ధ్య పనులు, గ్రామపంచాయతీ రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రికార్డుల్లో నమోదుచేసిన వాటిని వెంటనే ఆన్‌లైన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ రామ్మోహన్‌రావు, పంచాయతీ కార్యదర్శి సాయి తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారులు సమన్వయంతో పనిచేయాలి

- జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి బి.సాంబశివరావు

పర్వతగిరి: ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడానికి వైద్యాధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి బి.సాంబశివరావు సూచించారు. కొంకపాక అయుష్మాన్ ఆరోగ్య మందిరం, పర్వతగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇమ్యునైజేషన్, వ్యాక్సినేషన్, ఐఎల్ఆర్ రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేసి మాట్లాడారు. ప్రభుత్వాస్పత్రుల్లో సిజేరియన్లు కాకుండా సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని పేర్కొన్నారు. పుట్టిన ప్రతి బిడ్డకు షెడ్యూల్ ప్రకారం వ్యాక్సిన్ అందించాలని కోరారు. ప్రతి ఉద్యోగి తన ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తించాలని, సమయపాలన పాటించాలని, హెడ్‌క్వార్టర్‌లో ఉండాలని పేర్కొన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వర్షాకాలం ప్రారంభమైనందున మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, ఫైలేరియా, మెదడువాపు తదితర వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రాపిడ్ యాక్షన్ టీంలను సంబంధిత శాఖల సమన్వయంతో ఏర్పాటు చేసుకొని వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. వ్యాధి లక్షణాలు ఉన్న వెంటనే వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సహాయంతో తగిన పరీక్షలు, చికిత్స తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, సీసీ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉగ్రామాత, శివదూతీమాతగా భద్రకాళి



ఉగ్రామాతగా అమ్మవారు



శివదూతీమాతగా అమ్మవారు

హన్మకొండ కల్చరల్: శ్రీభద్రకాళి దేవాలయంలో నిర్వహిస్తున్న శాకంబరీ నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా బుధవారం ఏడో రోజు అమ్మవారిని ఉగ్రామాత, శివదూతీమాతగా అలంకరించి పూజలు నిర్వహించారు. అర్చకుడు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో వేదపండితులు ఉదయం అమ్మవారికి సుప్రభాతసేవ, నిత్యాహ్నికం నిర్వహించారు. అనంతరం కాళీక్రమాన్ని అనుసరించి స్నపనభేరాన్ని ఉగ్రామాతగా, షోడశీక్రమాన్ని అనుసరించి భోగభేరాన్ని శివదూతీమాతగా అలంకరించి పూజలు జరిపారు. ఈఓ శేషుభారతి, సిబ్బంది, ధర్మకర్తలు తొనుపునూరి వీరన్న, గాండ్ల స్రవంతి, అనంతుల శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కాలనీల్లో దుర్గంధం

కాల్వలు లేక రోడ్లపై ప్రవహిస్తున్న మురుగునీరు
- దోమలు, ఈగలతో వ్యాధుల బారిన ప్రజలు
- జీడబ్ల్యూఎంసీ, పట్టణాల్లో అస్తవ్యస్తంగా డ్రెయినేజీ



- శిథిలావస్థకు చేరిన డ్రెయినేజీని చూపిస్తున్న ఈ వ్యక్తి పేరు అఖిల్. నర్సంపేట పాకాల సెంటర్‌లోని తన ఇంటి సమీపంలో ఉన్న మురుగు కాల్వను అధికారులు మరమ్మతులు చేయడం లేదని తెలిపాడు. దీంతో వర్షం పడితే వరద, మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తున్నా, ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని చెప్పాడు. ఈ పరిస్థితి నర్సంపేట, వర్ధన్నపేట మున్సిపాలిటీలతోపాటు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు కాలనీల్లో నెలకొంది.

సాక్షి ఫోకస్

నర్సంపేట: వర్షాకాలం వ్యాధులు విజృంభిస్తున్నాయి. డ్రెయినేజీల్లో పారాల్సిన మురుగు నీరు రోడ్లపైకి వస్తోంది. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌తోపాటు నర్సంపేట, వర్ధన్నపేట మున్సిపాలిటీల్లో డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా మారింది. వర్షాలు కురిస్తే డ్రెయినేజీలు పొంగిపొర్లి నీరు రోడ్లు ప్రవహిస్తోంది. దీంతో కాలనీల్లో దుర్గంధం వ్యాపించి వ్యాధులబారిన పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.



నర్సంపేట పట్టణంలోని డ్రెయినేజీల్లో నిలిచిన మురుగునీరు

పట్టించుకోని పాలకులు, అధికారులు..
జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట, వరంగల్‌లో స్వచ్ఛత,పరిశుభ్రతపై పాలకులు, అధికారులకు పట్టింపు లేకుండా పోయింది. ఎక్కడ చూసినా శిథిలావస్థకు చేరిన మురుగుకాల్వలే అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా కనిపిస్తున్నాయి. అభివృద్ధి నిధులు, పనులు కాగితాలకే పరిమితమై కాంట్రాక్టర్ల దోపిడీకి నిలయంగా మారాయి. ఎన్నికలు వచ్చాయంటే అభివృద్ధిపై గొప్పలు చెప్పుకునే రాజకీయ నాయకులు గెలిచిన తర్వాత పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నామమాత్రంగా చెత్త తొలగింపు..
వరంగల్ జిల్లా కేంద్రం తర్వాత నర్సంపేటను ప్రధాన పట్టణంగా చెప్పుకుంటారు. 24 వార్డులు ఉండగా విలీన గ్రామాలతో కలిపి వార్డుల సంఖ్య 30కి చేరింది. 180 కిలోమీటర్ల విస్తీర్ణంలో డ్రెయినేజీ వ్యవస్థ ఉంది. ఇందులో 90 శాతం కూడా కాల్వలను నిర్మించని పరిస్థితి నెలకొంది. 29 మంది స్వీపర్లు, 18 మంది నైట్ వర్కర్లు, 24 మంది డ్రెయినేజీ క్లీనర్లు, ఒకరు జేసీబీ డ్రైవర్లు, ట్రాక్టర్ డ్రైవర్లు, 24 మంది ఆటోడ్రైవర్లు, ఏడుగురు జవాన్లతో కలిపి 127 మంది సిబ్బంది ఉన్నారు. అయినప్పటికీ డ్రెయినేజీల్లో చెత్త తొలగింపు ప్రక్రియ అంతంతమాత్రంగానే ఉంది.

నర్సంపేట పట్టణ వివరాలు..
జనాభా : 60 వేలు
వార్డులు : 30
అంతర్గత రోడ్ల విస్తీర్ణం : 180 కిలోమీటర్లు
డ్రెయినేజీలు : 350 కిలోమీటర్లు
సీసీ డ్రెయినేజీలు : 243 కిలోమీటర్లు
కచ్చా నాలాలు : 113 కిలోమీటర్లు

నోటీసులకే పరిమితం...
పట్టణంలోని ఓపెన్ ప్లాట్లలో పిచ్చిమొక్కలు, మురుగునీరు, వర్షపు నీరు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్లాట్ల యజమానులదే. వారు పట్టించుకోకపోవడంతో ఓపెన్ ప్లాట్లలో మురుగు నీరు పేరుకుపోయి దోమలకు నిలయంగా మారాయి. గత పట్టణ ప్రగతిలో వీటిని గుర్తించి జాగ్రత్తలు తీసుకోవాలని ఇచ్చిన నోటీసులు తాత్కాలిక హెచ్చరికలుగానే మారాయి. ప్రతీ వర్షాకాలంలో ఓపెన్ ప్లాట్లు చిన్నపాటి చెరువులుగా మారుతున్నాయి. వాస్తవానికి నర్సంపేట, వర్ధన్నపేట, వరంగల్ పట్టణ ప్రాంతాల్లో ఖాళీ ప్లాట్లు ఎన్ని ఉన్నాయో కూడా అధికారుల వద్ద లెక్కలు లేవు.

సైడ్ డ్రెయినేజీ నిర్మించాలని వినతి..



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న మాజీ ఎంపీటీసీ

నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని 20వ డివిజన్‌లో చుక్క కనుకయ్య ఇంటి నుంచి గిరగాని మల్లయ్య ఇంటి వరకు సైడ్ డ్రెయినేజీని నిర్మాణం చేపట్టాలని మాజీ ఎంపీటీసీ రామగోని సౌందర్య కోరారు. ఈమేరకు బుధవారం నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సౌందర్య మాట్లాడుతూ కాల్వ ధ్వంసం కావడంతో ఇళ్లలోకి మురుగు నీరు ప్రవహించి దుర్గంధం వెదజల్లుతూ దోమలు స్వైర విహారం చేస్తున్నాయన్నారు. స్పందించిన ఎమ్మెల్యే మాధవరెడ్డి సైడ్ డ్రెయినేజీ, సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు సౌందర్య తెలిపారు.

ఇబ్బందులు పడాల్సిందే..



వర్షం పడిందంటే పాకాల రోడ్డు నుంచి ఈ కాలనీకి వెళ్లాలంటే ఇబ్బందులు పడాల్సిందే. వరదనీరు అంతా ఈ కాలనీకి వచ్చి చేరుతుంది. వరద వెళ్లిపోయాక సీసీ రోడ్డు మొత్తం బురదమయంగా మారుతుంది. దీంతో ఈ రోడ్డు నుంచి నడవాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది.
- కేతావత్ వెంకన్న, పాకాల రోడ్డు, నర్సంపేట

వర్షాకాలం నరకమే..



వర్షాకాలం వచ్చిందంటే కాలనీ వాసులకు నరకమే కనిపిస్తుంది. చిన్నపాటి వానకే వరద నీరు వచ్చి చేరుతుండడంతో కాలనీలోని సీసీ రోడ్డు అంతా జలమయమై ఇబ్బందులు పడాల్సి వస్తోంది. దీంతో కాలనీ మొత్తం దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో దోమలు, ఈగలు వ్యాప్తి చెంది ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు.
- రాంబాబు, మహబూబాబాద్ క్రాస్‌రోడ్డు, నర్సంపేట

ఇందిరమ్మ ఇళ్ల పనుల్లో వేగం పెంచండి

- కలెక్టర్ డాక్టర్ సత్యశారద



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద



పాఠశాలలో భోజనం చేస్తున్న కలెక్టర్

నెక్కొండ: ఇందిరమ్మ ఇళ్ల పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ సత్యశారద సూచించారు. మండలంలోని సాయిరెడ్డిపల్లి, రెడ్లవాడ గ్రామాలను బుధవారం కలెక్టర్ సందర్శించి ఇళ్ల పనులు పరిశీలించారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మేస్త్రీలకు తగు సూచనలు చేశారు. సాయిరెడ్డిపల్లి అంగన్‌వాడీ సెంటర్‌ను కలెక్టర్ తనిఖీ చేసి చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. అంగన్‌వాడీ టీచర్ సునీత విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో షోకాజ్ నోటీస్ జారీ చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రెడ్లవాడ ప్రాథమిక పాఠశాలలో ఐఎఫ్‌పీ (ఇంటర్నెట్ ఫ్లాట్ ప్యానల్)లో బోధన ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యా బోధన జరగాలని ఆమె సూచించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కాగా, మెనూ ప్రకారం భోజనం అందించకపోవడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం రెడ్లవాడ పల్లె దవాఖానలో వైద్యసేవలు, మందుల నిల్వలు, వైద్య సిబ్బంది హాజరును ఆమె పరిశీలించారు. పీఏసీఎస్‌లోని ఎరువుల గోదాంను ఆమె సందర్శించి సరిపడా యూరియా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, డీపీఓ అనురాధ, డీఈఓ జ్ఞానేశ్వర్, నర్సంపేట ఆర్డీఓ ఉమారాణి, హౌసింగ్ పీడీ గణపతి, తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

మాటల మంటలు!

స్వపక్షంతోపాటు బీఆర్ఎస్, బీజేపీకి కార్నరైన కొండా మురళి వ్యాఖ్యలు

- మాజీ ఎమ్మెల్సీ తీరుతో కాంగ్రెస్ కేడర్‌లో అయోమయం
- ముఖ్యంగా పరకాల నియోజకవర్గంలో గ్రూపు రాజకీయాలు
- స్థానిక ఎన్నికల ముందు హస్తం పార్టీకి పెద్ద తలనొప్పి



సాక్షి, వరంగల్: మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి మాటలు అధికార పార్టీ కాంగ్రెస్‌లో కల్లోలం రేపుతున్నాయి. విపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీకి కూడా అస్త్రశస్త్రాలు దొరకడంతో రాజకీయం రసకందాయంగా మారింది. ఓవైపు సొంత పార్టీ ఎమ్మెల్యేలే కొండాపై చర్యలు తీసుకోవాలని పట్టుబడుతున్నారు. వరంగల్ తూర్పు ఎమ్మెల్యేగా పోటీచేసిన కొండా సురేఖ రూ.70 కోట్లు ఖర్చు చేశారని స్వయంగా ఆమె భర్త కొండా మురళి బహిరంగంగా ప్రకటించారు.. ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకొని ఆమె శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని మరోవైపు బీఆర్ఎస్, బీజేపీ నాయకులు నేరుగా కలిసి ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ పార్టీకి కీలక నేతగా చెలామణి అవుతున్న కొండా మురళి మాటలతో అందరికీ కార్నర్ అయ్యారని రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో కొన్నిరోజుల క్రితం ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కడియం శ్రీహరిపై పరోక్షంగా ఘాటైన పదజాలాన్ని ఉపయోగించిన మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి.. ఇప్పుడు ఓరుగల్లు రాజకీయాల్లో ఎర్రబెల్లి కుటుంబంలో పుట్టినవారు ఎర్రబల్లులేనని విమర్శించడంతో మాటల మంటలకు ఆజ్యం పోసినట్లయ్యింది. దీనికి బదులుగా కొండా మురళిని పిచ్చాస్పత్రిలో చేర్పించాలన్న బీజేపీ నేత ఎర్రబెల్లి ప్రదీప్‌రావు.. నాడు ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, నేడు రేవంత్‌రెడ్డి సహకారంతో పదవులు పొందింది నిజం కాదా అని ప్రశ్నించారు. బీసీలు, సొంత పార్టీ నేతలు, వరంగల్ తూర్పు ప్రజలను ఇబ్బంది పెడుతున్నారంటూ ఆయన ఫైర్ అయ్యారు. ఇలా కొన్నిరోజుల నుంచే వరంగల్ రాజకీయం అంతా కొండా చుట్టూనే తిరుగుతుండడం గమనార్హం. ఇంకోవైపు పరకాల ఎమ్మెల్యేగా కొండా సుష్మితాపటేల్ పోటీ చేస్తారని ప్రకటించారు. దీంతో ఆ నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీలోనే రెండు గ్రూపులవడం, సొంత పార్టీకే పెద్ద తలనొప్పిగా మారిందనే అభిప్రాయాలు రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి.

కాంగ్రెస్ నిర్ణయం ఎలా ఉంటుందో..?
స్థానిక ఎన్నికలకు అన్ని విధాలుగా సిద్ధమవుతున్న కాంగ్రెస్ పార్టీకి వరంగల్‌లోని రాజకీయం మాత్రం చికాకుపరుస్తోంది. ఇప్పటికే రైతు భరోసా నిధులు విడుదల చేసి గ్రామాల్లో రైతుల నుంచి మద్దతు కూడగట్టుకుంటామనుకుంటున్న కాంగ్రెస్‌కు మాత్రం ఇక్కడి ముఖ్య ప్రజాప్రతినిధుల మధ్య వైరుధ్యం తలనొప్పిగా మారిందనే టాక్ ఉంది. అందుకే నష్టనివారణ చర్యల్లో భాగంగా ఇరువైపుల నుంచి వివరణ తీసుకుందని, అయితే ఏ నిర్ణయం ఉంటుందో చూడాలని కిందిస్థాయి కార్యకర్తలు అంటున్నారు. ముఖ్యనేతల మధ్య ఇలానే వైరుధ్యం కొనసాగితే పార్టీకి ప్రతికూల ఫలితాలు వచ్చే అవకాశం లేకపోలేదన్న చర్చ కూడా నడుస్తోంది. కిందిస్థాయి క్యాడర్‌లో మాత్రం అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి. ఓవైపు నామినేటెడ్ పోస్టులు భర్తీ చేయకుండా కాంగ్రెస్ పార్టీలో ఇదేం రాజకీయమని మదనపడుతున్నారు. కొన్నిరోజులుగా కొండా ఎపిసోడ్ సీరియల్‌గా నడుస్తుండడంతో ఏం జరుగుతుందోనన్న ఉత్కంఠ కార్యకర్తల్లో నెలకొంది. సాధ్యమైనంత తొందరగా ఈ విషయంలో ఏదో ఒక నిర్ణయం తీసుకుంటే తప్ప దీనికి చెక్‌పడేలా కనిపించడం లేదు.

ఈసారి ముందస్తుగానే.. మహాజాతర

అధిక అమావాస్య రాకతో జనవరిలో నిర్వహణ
- మేడారం జాతర తేదీలను ప్రకటించిన పూజారులు
- 2026 జనవరి 28 నుంచి 31 వరకు..
- కొనసాగుతున్న శాశ్వత అభివృద్ధి పనులు



సారలమ్మ గద్దె



సమ్మక్క గద్దె



జాతర తేదీలను ప్రకటిస్తున్న పూజారులు

ఎస్ఎస్‌తాడ్వాయి: తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధి చెందిన మేడారం సమ్మక్క–సారలమ్మ మహాజాతర తేదీలు ఖరారయ్యాయి. 2026 జనవరి 28 నుంచి 31 వరకు మహాజాతర జరగనుంది. ప్రతీ రెండేళ్లకోసారి సాగే మహాజాతర తేదీలను పూజారులు ఎక్కువగా ఫిబ్రవరి నెలలోనే ఖరారు చేస్తారు. ఈసారి అధిక అమావాస్య రావడంతో వచ్చే ఏడాది జనవరి నెలాఖరులో నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు పూజారులు బుధవారం మహాజాతర తేదీలను ప్రకటించారు.

20 రోజుల ముందుగానే జాతర..
ఫిబ్రవరిలో నిర్వహించాల్సిన మేడారం మహాజాతర ఈసారి 2026 జనవరి 28 నుంచి 31 వరకు జరగనుంది.దీంతో 20 రోజుల ముందుగానే మహాజాతర జరగనుంది. పూజారులు పంచాంగం, కొత్త క్యాలెండర్ ప్రకారం మాఘశుద్ధ పౌర్ణమి, అమ్మవార్ల ఘడియలను బట్టి జాతర తేదీలను ఖరారు చేస్తారు. ప్రతీ రెండేళ్లకోసారి జాతర తేదీలను అమావాస్య రోజుల్లో పౌర్ణమికి ముందుగా నిర్ణయించడం ఆనవాయితీ. ఈసారి 2026 జనవరి 17 నుంచి అమావాస్య మాసం ప్రారంభం కావడం, జనవరి 31న పౌర్ణమి అవుతుండడంతో మాఘశుద్ధ పౌర్ణమికి ముందుగా జాతర తేదీలను నిర్ణయించారు. అంటే అధిక అమావాస్య రావడంతో ఈసారి జనవరిలోనే నిర్ణయించినట్లు పూజారులు వెల్లడించారు.

2018లో జనవరిలోనే జాతర..
గత మహాజాతరల తేదీలతో పోలిస్తే 2018లో జనవరి 31 నుంచి ఫిబ్రవరి 3 వరకు జాతర తేదీలను నిర్ణయించారు. అలాగే 2010లో ఫిబ్రవరి 17 నుంచి 20 వరకు, 2012లో ఫిబ్రవరి 8 నుంచి 11వరకు, 2014లో ఫిబ్రవరి 12 నుంచి 15 వరకు, 2016లో ఫిబ్రవరి 17 నుంచి 20 వరకు, 2020లో ఫిబ్రవరి 5 నుంచి 8 వరకు, 2022లో ఫిబ్రవరి 16 నుంచి 19 వరకు, 2024లో ఫిబ్రవరి 21 నుంచి 24 వరకు మహాజాతర సాగింది. 2018లో మాత్రం జనవరి 31 నుంచి జాతర సాగగా.. ఈ దఫా 2026 జనవరి నెలాఖరులోనే జాతర సాగనుంది.

జాతర ఇలా..
- **జనవరి 28వ తేదీ:** సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు గద్దెలపైకి రాక
- **29వ తేదీ:** సమ్మక్క గద్దెపైకి
- **30వ తేదీ:** భక్తుల మొక్కుల చెల్లింపు
- **31వ తేదీ:** దేవతల వనప్రవేశం

అధికార యంత్రాంగం సమాయత్తం
మేడారం మహాజాతర తేదీలను పూజారులు ప్రకటించడంతో జిల్లా అధికార యంత్రాంగం జాతర అభివృద్ధి పనులపై సమాయత్తం కానుంది. ఈసారి ముందస్తుగానే శాశ్వత అభివృద్ధి పనులను పూర్తి చేయాలనే సంకల్పంతో అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. రాష్ట్ర మంత్రి సీతక్క చొరవతో ఇప్పటికే మేడారంలో శాశ్వత నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఇకనుంచి జిల్లా యంత్రాంగం జాతర అభివృద్ధి పనులపై ప్రణాళికలతో ముందుకెళ్తూ భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు కోరారు.

10లోగా మార్కెట్ ఫీజు బకాయిలు చెల్లించాలి

- మార్కెటింగ్ జేడీ శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న జేడీ శ్రీనివాస్

వరంగల్ చౌరస్తా: వ్యాపారులు, పండ్లు, కూరగాయల, అద్దె బకాయిదారులు మార్కెట్ ఫీజును ఈనెల 10వ తేదీలోగా చెల్లించాలని వరంగల్ మార్కెటింగ్ శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు శ్రీనివాస్ ఆదేశించారు. బుధవారం వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ ప్రధాన కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జేడీ శ్రీనివాస్ మాట్లాడుతూ పన్నులు సకాలంలో చెల్లిస్తేనే రైతులకు, ఆయా వర్గాలకు మెరుగైన వసతులు లభిస్తాయని పేర్కొన్నారు. అనంతరం కూరగాయల వర్తక సంఘం కలిసి జేడీకి పుష్పగుచ్ఛం అందించింది. కార్యక్రమంలో ప్రాంతీయ ఉప సంచాలకులు పద్మావతి, కార్యదర్శి గుగులోత్ రెడ్డి, గ్రేడ్–2 కార్యదర్శి జి.రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు నీటిని వృథా చేయొద్దు

- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి
- పాకాల సరస్సు నీటి విడుదల



పాకాల సరస్సు నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

ఖానాపురం: పాకాల ఆయకట్టు పరిధిలోని రైతులు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సూచించారు. మండలంలోని పాకాల సరస్సు నీటిని ఆయన విడుదల చేశారు. ముందుగా ఆంజనేయస్వామి, కట్టమైసమ్మకు పూజలు చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ పాకాల కాల్వల మరమ్మతుల కోసం డీపీఆర్‌లు తయారు చేసి ప్రభుత్వానికి పంపించినట్లు తెలిపారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ముందస్తుగా నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. లీకేజీలు ఇప్పటికే అరికట్టామని, వచ్చే సీజన్ నాటికి 80 శాతం నిధులు విడుదల చేసి పనులు ప్రారంభిస్తామని ఆయన వివరించారు. జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ వీసీ అల్దాస్ జానయ్య మాట్లాడుతూ రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో 1.20 లక్షల మంది రైతులకు సూచనలు చేసినట్లు తెలిపారు. రెండో పంట సాగులో రైతులు వరికి బదులుగా ఇతర పంటలు సాగుచేసి అధిక లాభాలు గడించాలన్నారు. ఈఈ సుదర్శన్‌రావు, ప్రొఫెసర్ వెంకటనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, తహసీల్దార్ రమేశ్, డీఈ రమేశ్, వెంకటప్రసాదరావు, ముస్తఫా, సాగర్‌రావు, ఎల్లాగౌడ్, విద్యాసాగర్‌రావు, మోహన్‌రెడ్డి, మురళి, ఉపేందర్, వేణుగోపాల్‌రావు, రవి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

న్యూశాయంపేట: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉపాధి సంబంధిత ప్రోత్సాహక పథకానికి(ఈఎల్ఐ) దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రాంతీయ ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) కమిషనర్ వైడీ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధి సృష్టించడం, ప్రోత్సహించడం, ఉపాధి సామర్థ్యాన్ని పెంపొందించడం, సామాజిక భద్రతను ఈ పథకం ద్వారా మెరుగుపరచాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని పేర్కొన్నారు. మరింత సమాచారం కోసం వరంగల్ ప్రాంతీయ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

విచారణ పేరుతో ఈటీసీ ప్రిన్సిపాల్ హల్‌చల్

- నిరసన తెలిపిన గంగదేవిపల్లి గ్రామస్తులు
- ఏ అధికారంతో వచ్చారని నిలదీత



గంగదేవిపల్లిలో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు



విచారణ చేస్తున్న ఈటీసీ ప్రిన్సిపాల్ విజయనాయక్

గీసుకొండ: మండలంలోని జాతీయ ఆదర్శ గ్రామం గంగదేవిపల్లిలో విచారణ కోసం వచ్చానంటూ హసన్‌పర్తి ఈటీసీ(ఎక్స్‌టెన్షన్ ట్రెయినింగ్ సెంటర్) ప్రిన్సిపాల్ విజయనాయక్ బుధవారం హల్‌చల్ చేసింది. కలెక్టర్, ఉన్నతాధికారుల ఆదేశాలు లేకున్నా ఆమె స్వయంగా రంగంలోకి దిగి విచారణ చేపట్టడం వివాదాస్పదంగా మారింది. ఏ హోదాతో విచారణ చేపట్టడానికి వచ్చారంటూ గ్రామస్తులు నిలదీశారు. వివరాలు ఇలా ఉన్నాయి. 2015లో అప్పటి సీఎం కేసీఆర్ గ్రామజ్యోతి పథకం కింద గ్రామానికి రూ.10 కోట్లు మంజూరు చేశారు. కాగా, ఈ విషయంలో నిధుల దుర్వినియోగం జరిగిందని సదరు ప్రిన్సిపాల్.. ట్రెయినింగ్ మేనేజర్ కూసం రాజమౌళికి నోటీసు ఇచ్చారు. ఆ నిధులతో తనకు సంబంధం లేదని చెప్పినా పట్టించుకోకుండా ఆమె మెమోలు జారీ చేసి విచారణకు వచ్చింది. దీంతో పాటు గ్రామస్తులను కూడా విచారణకు రావాలని కోరింది. గ్రామస్తులు ఆమె తీరును నిరసిస్తూ రాజమౌళికి ఎలా నోటీసులు ఇచ్చారని అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మీకు అతడిపై ఎవరు ఫిర్యాదు చేశారని, ఎవరి ఆదేశానుసారం వచ్చారని ప్రశ్నించి నిలదీశారు. తనకు గ్రామంలోని ముగ్గురు వ్యక్తులు నోటి మాటతో ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టామని ప్రిన్సిపాల్ చెప్పడంతో గ్రామస్తులు అభ్యంతరం తెలిపారు.

గ్రామంలోని శిక్షణ కేంద్రం నిర్వహణలో రాజమౌళి సక్రమంగా పనిచేయడం లేదని పలుమార్లు నోటీసులు ఇచ్చామని, ఆయన వివరణ సరిగా లేకపోవడంతో విచారణకు వచ్చామని ఆమె పేర్కొన్నారు. శిక్షణ కేంద్రానికి సంబంధించిన రికార్డులను సీజ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే, ఈ విషయంపై విలేకరులు ఆమెను వివరణ కోరగా సరిగా స్పందించలేదు.

క్లుప్తంగా

చిరుద్యోగుల విభజనకు షెడ్యూల్


హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్ పూర్వ వరంగల్ సర్కిల్‌లో నిలిచిన చిరుద్యోగుల విభజన ప్రక్రియ అడుగు ముందుకు పడింది. మూడేళ్లుగా జాప్యం జరుగుతూ వస్తున్న ఆ ప్రక్రియ ఎట్టకేలకు ప్రారంభకానుంది. టీజీ ఎన్పీడీసీఎల్ సీజీఎం ఆడిట్ చైర్మన్‌గా, హనుమకొండ సర్కిల్ సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ కన్వీనర్‌గా, ఆరు సర్కిళ్ల ఎస్‌ఈలు సభ్యులుగా ఉన్న కమిటీ.. వాచ్‌మెన్, స్వీపర్, ఎల్‌ఎండీ పోస్టుల బైపర్‌కేషన్‌కు నిర్ణయం తీసుకుంది. వాచ్‌మెన్, స్వీపర్, ఎల్‌ఎండీలకు ఈ నెల 15 వతేదీ వరకు వారు ఎక్కడి వెళ్తారో సంసిద్ధత తెలిపేందుకు దరఖాస్తులు అందిస్తారు. పూరించిన ఆ దరఖాస్తులను ఈ నెల 31వ తేదీలోపు స్వీకరిస్తారు. ఆగస్టులో పరిశీలించి ఉద్యోగుల విభజన పూర్తి చేస్తారు. ఈ మేరకు సీజీఎం ఆడిట్ షెడ్యూల్ ఖరారు చేశారు.

టెమ్రిస్ ఉమ్మడి జిల్లా ఆర్‌ఎల్‌సీగా సతీశ్



న్యూశాయంపేట : తెలంగాణ మైనారిటీ గురుకులాల విద్యాసంస్థల(టెమ్రిస్) ఉమ్మడి వరంగల్ జిల్లా రీజినల్ లెవల్ కో–ఆర్డినేటర్(ఆర్‌ఎల్‌సీ)గా హనుమకొండ(బి–1) గురుకులం ప్రిన్సిపాల్ డాక్టర్ జంగా సతీశ్ నియమితులయ్యారు. ఈ మేరకు సెక్రటరీ షఫియుల్లా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో ఇద్దరు ఆర్‌ఎల్‌సీలు మూడు జిల్లాలకు ఒకరు చొప్పున పదహారు గురుకులాలను పర్యవేక్షిస్తుండగా ఉమ్మడి జిల్లాలో ఉన్న 16 గురుకులాలను ఒక్కరే పర్యవేక్షించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆర్‌ఎల్‌సీగా నియమితుడైన సతీశ్‌ను ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గురుకులాల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, పలువురు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అభినందించారు.

వరంగల్ మీదుగా తిరుపతికి 8 వీక్లీ రైళ్లు



కాజీపేట రూరల్: దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలంగాణలో కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లా ప్రజల రద్దీని దృష్టిలో ఉంచుకుని తిరుపతి పుణ్యక్షేత్రానికి వరంగల్ మీదుగా జూలై 6వ తేదీ నుంచి కరీంనగర్–తిరుపతి మధ్య 8 ప్రత్యేక రైళ్ల సర్వీస్‌లను నడిపిస్తున్నట్లు బుధవారం తెలిపారు.

ప్రత్యేక రైళ్ల సర్వీస్‌ల వివరాలు

ఈ నెల 6వ తేదీ నుంచి 27వ తేదీ వరకు తిరుపతి–కరీంనగర్ (02761) వీక్లీ ఎక్స్‌ప్రెస్ వరంగల్‌కు ప్రతీ సోమవారం వచ్చి వెళ్తుంది. 7వ తేదీ నుంచి 28వ తేదీ వరకు కరీంనగర్–తిరుపతి (02762) వీక్లీ ఎక్స్‌ప్రెస్ ప్రతీ సోమవారం వరంగల్‌కు వచ్చి వెళ్తుంది. ఈ రైళ్ల సర్వీస్‌లకు రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, మధిర, ఖమ్మం, డోర్నకల్, మహబూబాబాద్, వరంగల్, జమ్మికుంట, పెద్దపల్లిలో అప్ అండ్ డౌన్ రూట్‌లో హాల్టింగ్ సౌకర్యం కల్పించారు.

ఇక వినియోగంలోకి..

ఎట్టకేలకు అన్‌యూజ్డ్ పోస్టులకు మోక్షం
- 339 ఉద్యోగాలు క్రియేట్ చేసి ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- ఉన్నత స్థాయి పోస్టులు పెరగడంతో లభించనున్న పదోన్నతి
- ఆశావహుల్లో వెల్లువెత్తిన సంతోషం..
- తీరనున్న అధికారుల కొరత



టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం

హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్‌లోని అన్‌యూజ్డ్ పోస్టులకు మోక్షం లభించింది. ఏళ్లుగా పక్కకు పెట్టిన ఆ పోస్టులు ఎట్టకేలకు ఇక వినియోగంలోకి రానున్నాయి. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 216 అన్‌యూజ్డ్ పోస్టులతో పాటు ప్రస్తుతం అవసరం లేని 217 పోస్టులను రద్దు చేస్తూ అవసరమైన 339 పోస్టులను క్రియేట్ చేస్తూ రాష్ట్ర ఆర్థిక శాఖ ఆమోదం తెలిపింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానీయా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏళ్లుగా వినియోగంలో లేని డీఎం గ్రేడ్–1, హెల్పర్ బెంచ్, గన్‌మాన్, టెలిఫోన్ బాయ్, కార్పెంటర్, సివిల్ మేస్త్రీ, స్టోర్ కీపర్, టూల్ కీపర్, ఎలక్ట్రీషియన్, వెల్డర్ కమ్ మిక్సర్, టెలిఫోన్ ఆపరేటర్, ఎస్‌ఎస్‌ఏ, ఎల్‌ఎండీ, జేఎల్‌ఎండీ, క్లీనర్, రోనియో ఆపరేటర్, లష్కర్ వంటి 216 పోస్టులతో పాటు ప్రస్తుతం ఖాళీగా ఉన్న 217 జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులను రద్దు చేస్తూ కొత్త పోస్టులుగా పునరుద్ధరించారు. దీంతో కొత్తగా 2 చీఫ్ ఇంజనీర్, 1 జాయింట్ సెక్రటరీ, 4 సూపరిటెండెంట్ , 1 జనరల్ మేనేజర్, 4 డివిజనల్ ఇంజనీర్, 4 సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్, , 6 అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్, 1 అకౌంట్స్ ఆఫీసర్, 2 అసిస్టెంట్ అకౌంట్ , 4 పర్సనల్ ఆఫీసర్ , 16 సబ్ ఇంజనీర్, 16 అసిస్టెంట్ ఇంజనీర్, 20 జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్, 32 సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్, 88 సీనియర్ అసిస్టెంట్, 48 అసిస్టెంట్ లైన్‌మెన్, 80 ఆఫీస్ సబార్డినేట్, 4 వాచ్‌మెన్, స్వీపర్ కమ్ గార్డెనర్, స్వీపర్, 6 శానిటరీ ఆర్డర్లీస్ పోస్టులు మంజూరయ్యాయి. దీంతో అధికారుల కొరత తీరనుంది.

పెరిగిన ఉన్నత స్థాయి పోస్టులతో పదోన్నతి..

ఉన్నత స్థాయి పోస్టులు పెరగడంతో పదోన్నతి లభించనుంది. అన్ యూజ్డ్ పోస్టులను నూతన పోస్టులుగా సృష్టించేందుకు ప్రభుత్వ అనుమతి కోరినప్పటి నుంచి చాలా మంది ఆశావహులు పదోన్నతి కోసం ఎదురుచూస్తున్నారు. చివరకు ప్రభుత్వం కొత్త పోస్టులు సృష్టిస్తూ అనుమతి ఇవ్వడంతో వారిలో సంతోషం వెల్లివిరిస్తోంది. సీజీఎం, ఎస్‌ఈ, డీఈ, ఏడీఈ, జనరల్ మేనేజర్, జాయింట్ సెక్రటరీ, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్, అకౌంట్స్ ఆఫీసర్, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ పదోన్నతి కోసం చాలా మంది ఎదురుచూస్తున్నారు. పోస్టులకు అనుమతి వచ్చినా పదోన్నతి ప్రక్రియ అంశం కోర్టులో ఉంది. పదోన్నతులపై హైకోర్టు స్టే విధించడంతో కొంత కాలంగా ఈ ప్రక్రియ నిలిచింది. కోర్టు ఏ క్షణాన స్టే ఎత్తివేసిన వెంటనే పదోన్నతి కల్పించేందుకు యాజమాన్యం సిద్ధంగా ఉంది. నూతన పోస్టుల కోసం టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి కృషి ఫలించిందని ఆయా సంఘాలు, అసోసియేషన్ల నాయకులు తెలిపారు. అవసరమైన పోస్టులు పెరగడంతో వినియోగదారులకు మరింత మెరుగైన, నాణ్యమైన సేవలు అందుతాయన్నారు.

కేసీఆర్, కేటీఆర్ జైలుకెళ్లడం ఖాయం

కాళేశ్వరం కూలిపోవడానికి కేసీఆర్, హరీశ్‌రావే కారణం
- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

వేలేరు: కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్ కేసులతో కేసీఆర్, కేటీఆర్ జైలుకెళ్లడం ఖాయమని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. బుధవారం వేలేరు మండల కేంద్రంలోని రైతు వేదికలో 17 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోవడానికి కేసీఆర్, హరీశ్‌రావే ప్రధాన కారణమని ఆరోపించారు. మేడిగడ్డ లేకపోతే కాళేశ్వరం ప్రాజెక్టు లేదని, మనిషికి గుండె ఎంత ముఖ్యమో కాళేశ్వరానికి కూడా మేడిగడ్డ అంతే ముఖ్యమన్నారు. రూ.లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ద్వారా కనీసం 50 వేల ఎకరాలకు కూడా సాగునీరు అందలేదని విమర్శించారు. బనకచర్ల ప్రాజెక్టుకు నాంది పలికింది కేసీఆరేనని, గతంలో ఆయన ఆంధ్రా ప్రాజెక్టులకు సహకరిస్తామని చెప్పి ఇప్పుడు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణ హక్కులే ముఖ్యమని, బనకచర్ల, పోలవరం ప్రాజెక్టులను ఆపి తీరుతామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ హెచ్.కోమి, ఎంపీడీఓ లక్ష్మీప్రసన్న, ఏఓ కవిత, ఎంపీఓ భాస్కర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కత్తి సంపత్, కాంగ్రెస్ నాయకులు బిల్లా యాదగిరి, సద్దాం హుస్సేన్, మల్లికార్జున్, రాజిరెడ్డి, ప్రమోద్ రెడ్డి, లక్ష్మణ్‌నాయక్, రవీందర్, రణధీర్ రెడ్డి, సలీం మాలిక్, తదితరులు పాల్గొన్నారు.

దంపతుల మధ్య గొడవ..

- మనస్తాపంతో మహిళ ఆత్మహత్య
- తూర్పు తండాలో ఘటన



జ్యోతి(ఫైల్)

సంగెం: దంపతుల మధ్య గొడవతో మనస్తాపం చెందిన ఓ మహిళ క్షణికావేశంలో బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన సంగెం మండలం నల్లబెల్లి శివారు తూర్పు తండాలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తండాకు చెందిన అజ్మీరా జ్యోతి(44), బాలరాజు దంపతులకు ఇద్దరు కుమారులు సంతోశ్, సందీప్ ఉన్నారు. వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. పెద్ద కుమారుడికి వివాహం జరగగా వ్యవసాయం చేసుకుంటున్నాడు. చిన్న కుమారుడు చదువుకుంటున్నాడు. బుధవారం కుటుంబం, మేకలు మేపడానికి వెళ్లే విషయాల్లో దంపతుల మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన జ్యోతి వ్యవసాయ బావి వద్దకు వెళ్లి అందులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. జ్యోతి బావిలో దూకుతుండగా పక్క చేనులో కలుపు తీస్తున్న మహిళా రైతు బానోత్ బుజ్జమ్మ చూసి తండాకు చెందిన మూడు మోతీలాల్‌కు చెప్పింది. మోతీలాల్ తండాకెళ్లి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చాడు. వారు వచ్చి చూడగా జ్యోతి బావిలో కనిపించలేదు. డయల్100కు కాల్ చేసి విషయం తెలపడంతో స్థానిక పోలీసులు.. ఫైర్ రెస్క్యూ టీంకు సమాచారం అందించగా వారు వచ్చి వెతకగా జ్యోతి మృతదేహం లభించింది. మృతురాలి కుమారుడు సంతోశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ పేర్కొన్నారు.

వృత్తి నైపుణ్యంతోనే విధుల్లో రాణింపు

- ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్ కుమార్



మాట్లాడుతున్న ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్, పక్కన వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్

వరంగల్ క్రైం: విధుల్లో రాణించాలంటే వృత్తి నైపుణ్యం సొంతం చేసుకోవాలని ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్‌కుమార్ అన్నారు. బుధవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో మూడు రోజుల పాటు జరిగే భద్రాది కొత్తగూడెం జోనల్ పోలీస్ డ్యూటీ మీట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ భద్రాది పోలీస్ డ్యూటీ మీట్‌లో వరంగల్, ఖమ్మం పోలీస్ కమిషనరేట్లు, మహబూబాబాద్, భద్రాది కొత్తగూడెం పోలీస్ విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొంటున్నారని తెలిపారు. ప్రతీ విభాగంలో ప్రతిభ కనబరిచిన వారిని త్వరలో రాష్ట్ర స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌కు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. నేరాలు త్వరితగతిన ఛేదించేందుకు, సాక్ష్యాలను శాస్త్రీయంగా విశ్లేషించడానికి, ప్రజలకు న్యాయం అందించేందుకు ఈ వృత్తి శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్, అదనపు డీసీపీలు రవి, సురేశ్‌కుమార్, ప్రభాకర్‌రావు, బోనాల కిషన్, జోన్‌కు చెందిన ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు ఆర్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

భర్త, యువకుడి వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య



శైలజ (ఫైల్)

గార్ల: ఒక పక్క భర్త.. మరోపక్క ప్రేమపేరుతో తరచూ ఫోన్ చేస్తున్న ఓ యువకుడి వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన బుధవారం మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం ముల్కనూరులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చెందిన ఏదుల సతీశ్‌కుమార్‌తో ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు గ్రామానికి చెందిన శైలజ(24)కు 8 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరి కాపురం 5 సంవత్సరాలు సజావుగానే సాగింది. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ క్రమంలో 3 సంవత్సరాల నుంచి పిండిప్రోలు గ్రామానికి చెందిన యువకుడు కంపటి శ్రీరామ్.. తరచూ శైలజకు ఫోన్ చేసి ప్రేమపేరుతో వేధిస్తున్నాడు.'నేను నిన్ను ప్రేమిస్తున్నా.. మనమిద్దరం కలిసి ఉందాం.. పిల్లలు, భర్తను వదిలిపెట్టి రా'అని వేధిస్తున్నాడు. ఈ విషయం భర్త సతీశ్‌కుమార్‌కు రెండు సంవత్సరాల క్రితం తెలిసింది. దీంతో ఇద్దరి మధ్య వివాహేతర సంబంధం ఎన్నాళ్ల నుంచి కొనసాగుతుందని ప్రశ్నిస్తూ.. నువ్వు ఎందుకు బతుకుతున్నావు, చావరాదు అని తరచూ శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేసేవాడు. దీంతో భర్త సతీశ్‌కుమార్, యువకుడు శ్రీరామ్ వేధింపులు తాళలేక శైలజ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఎలుకల మందు తాగింది. గమనించిన భర్త సతీశ్‌కుమార్ హుటాహుటిన మహబూబాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా శైలజ మృతిచెందింది. ఈ ఘటనపై మృతురాలి తల్లి కవిత ఫిర్యాదు మేరకు భర్త సతీశ్‌కుమార్, యువకుడు శ్రీరామ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్‌కె. రియాజ్‌పాషా తెలిపారు.

పొంగిన పాకాల ఏరు



గార్ల సమీపంలోని చెక్‌డ్యాం పైనుంచి ప్రవహిస్తున్న పాకాల ఏరు

గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మహబూబాబాద్ జిల్లా గార్ల సమీపంలోని పాకాల ఏరు బుధవారం సాయంత్రం నుంచి చెక్‌డ్యాంనుంచి ప్రవహిస్తోంది. దీంతో గార్ల నుంచి రాంపురం, మద్దివంచ పంచాయతీల గ్రామాల ప్రజలు మండల కేంద్రమైన గార్లకు వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారు. పాకాల ఏటిపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టి ఈ గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని ఈ ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు. - గార్ల

మేడిగడ్డకు పెరుగుతున్న వరద



మేడిగడ్డ బ్యారేజీ గుండా తరలుతున్న వరద నీరు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం అంబట్‌పల్లి సమీపంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ(లక్ష్మి)బ్యారేజీకి ప్రాణహిత వరద తాకిడి రోజురోజుకూ పెరుగుతోంది. మహారాష్ట్రలో నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో ప్రాణహిత వరద ప్రవాహం కాళేశ్వరం మీదుగా మేడగడ్డకు చేరుతోంది. దీంతో బుధవారం సాయంత్రం వరకు 36,900 క్యూసెక్కుల వరద ప్రవాహం బ్యారేజీలోని మొత్తం 85గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు.

అభివృద్ధి పథంలో తెలంగాణ

- డిప్యూటీ స్పీకర్ జాటోత్ రామచంద్రునాయక్



మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ రామచంద్రునాయక్

మహబూబాబాద్ రూరల్ : తెలంగాణ రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తున్నారని అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ జాటోత్ రామచంద్రునాయక్ అన్నారు. బుధవారం మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలోని కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుల సన్నాహక సమావేశం పార్టీ పార్లమెంట్ నియోజవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్సీ పొట్ల నాగేశ్వర్ రావు అధ్యక్షతన జిల్లా కేంద్రంలోని వీరబ్రహ్మేంద్రస్వామి మందిరంలో నిర్వహించారు. డిప్యూటీ స్పీకర్ జాటోత్ రామచంద్రునాయక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో కాంగ్రెస్‌ను బలోపేతం చేసేందుకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ముఖ్యఅతిథిగా హాజరుకానుండగా ఈ నెల 4వ తేదీన హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నారన్నారు. నాయకులు, కార్యకర్తలను ప్రభుత్వంలో భాగస్వాములను చేసేందుకు ఖర్గే వస్తున్నారని, ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే ఆశావహులు తప్పనిసరిగా ఖర్గే సభకు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడానికి నేతలకు దిశానిర్దేశం చేయనున్నారని తెలిపారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లో బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించేందుకు కృషి చేస్తామని, సెప్టెంబర్ లోపు గ్రామపంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్, మున్సి పాలిటీ ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో మానుకోట, భద్రాచలం, సత్తుపల్లి ఎమ్మెల్యేలు డాక్టర్ మురళీనాయక్, తెల్లం వెంకట్రావు, మట్టా రాగమయి, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు మద్ది బేబీస్వర్ణకుమారి, నాగ సీతారాములు, డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్ రెడ్డి, కేసముద్రం ఏఎంసీ చైర్మన్ ఘంట సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా లక్ష్యాలు పూర్తి చేయాలి

- టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు



మాట్లాడుతున్న టెస్కాబ్ చైర్మన్ రవీందర్ రావు

హన్మకొండ : నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని తెలంగాణ స్టేట్ కో–ఆపరేటివ్ అపెక్స్ బ్యాంకు, వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు బ్రాంచ్ మేనేజర్లను ఆదేశించారు. బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని వరంగల్ డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్‌తో సమీక్ష సమావేశం నిర్వహించారు. బ్రాంచ్‌ల వారీగా ప్రగతిని సమీక్షించారు. ప్రతీ అధికారి, ఉద్యోగి వ్యక్తిగత పనితీరును మెరుగు పరుచుకోవాలన్నారు. పీఏసీఎస్‌ల ద్వారా ఇచ్చిన రుణాలు కూడా లీగల్‌గా కవర్ చేసి రికవరీ చేసి సంఘాలను పటిష్టం చేయాలని సూచించారు. ఐఆర్‌ఏసీ నిబంధనలకు లోబడి మార్చి నెలకు సంబంధించి నిరార్ధక రుణాలుగా వర్గీకరించిన బకాయిలను రికవరీ చేయాలని ఆదేశించారు. నిరార్ధక ఆస్తులు 2 శాతానికి లోబడి టర్నోవర్ రూ.2,500 కోట్లకు చేరేలా కృషి చేయాలన్నారు. మహిళ స్వయం సహాయక సంఘాలు, చిరు వ్యాపారులకు ఇచ్చిన రుణాల చెల్లింపుపై వన్‌టైమ్ సెటిల్‌మెంట్ వివరించి వారి ద్వారా రుణాలు రికవరీ చేయాలని సూచించారు. నాబార్డు తనిఖీల్లో వరంగల్ డీసీసీబీ ఏ కేటగిరీ సాధించేలా బ్యాంకు అభివృద్ధికి కృషి చేయాలన్నారు. వేతన సవరణ చేసినందుకు ఈ సందర్భంగా చైర్మన్ రవీందర్ రావును మేనేజర్లు, ఉద్యోగులు సన్మానించారు. సమావేశంలో సీఈఓ వజీర్ సుల్తాన్, జీఎం పద్మావతి, డీజీఎం అశోక్, ఏజీఎంలు మధు, గొట్టం స్రవంతి, బోడ రాజు, గంప స్రవంతి, కృష్ణ మోహన్, డీఆర్ ఓఎస్డీ విజయ కుమారి, బ్రాంచ్ మేనేజర్లు పాల్గొన్నారు.

పథకాలను వేగవంతంగా అమలు చేయాలి



మాట్లాడుతున్న ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ జాయింట్ డైరెక్టర్ సంగీత లక్ష్మి

- వానాకాలంలోపు తోటల పెంపకం పూర్తి చేయాలి
- ఉద్యాన శాఖ జాయింట్ డైరెక్టర్ సంగీత లక్ష్మి

హన్మకొండ: ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాలను వేగవంతం చేయాలని ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ జాయింట్ డైరెక్టర్ సంగీత లక్ష్మి అన్నారు. పథకాల అమలు వేగవంతం చేసేందుకు రాష్ట్ర స్థాయి అధికారులను ఉమ్మడి జిల్లాల వారీగా సూపర్‌వైజర్ ఆఫీసర్లుగా నియమించారు. ఈ క్రమంలో సంగీత లక్ష్మి హనుమకొండలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వానాకాలం పూర్తయ్యేలోపు మూడు నెలల్లో ఆయిల్ పాం తోటల పెంపకంలో భాగంగా నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలు నాటాలన్నారు. అదే విధంగా ఇతర తోటల పెంపకాన్ని పూర్తి చేయాలని, సూక్ష్మ సేద్యపు పరికరాల బిగింపు పనులు మూడు నెలల్లో పూర్తి చేయాలన్నారు. ఇక నుంచి ప్రతీ వారం సమీక్ష సమావేశం నిర్వహించి జిల్లాల వారీగా నివేదికను వ్యవసాయ శాఖ మంత్రికి అందించనున్నట్లు తెలిపారు. సమావేశంలో హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, జనగామ డీహెచ్‌ఎస్‌ఓలు జి.అనసూయ, ఆర్.శ్రీనివాసరావు, మిరయన్న, శ్రీధర్‌రావు, మైక్రో ఇరిగేషన్ కంపెనీ ప్రతినిధులు, ఉద్యాన అధికారులు పాల్గొన్నారు.

పిల్లలకు పుస్తకాలు కొనుగోలు చేసి వెళ్తూ..

రోడ్డు ప్రమాదంలో తండ్రి దుర్మరణం
- మరొకరికి తీవ్ర గాయాలు
- స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఘటన



కుమార్ (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: అల్లారుముద్దుగా పెంచుకుంటున్న తన పిల్లలకు నోట్ పుస్తకాలు కొనుగోలు చేసి వెళ్తున్న క్రమంలో తండ్రి అనంతలోకాలకు చేరాడు. బైక్‌పై వెళ్తూ ముందు వెళ్తున్న మరో బైక్‌ను ఢీకొట్టి కిందపడ్డాడు. అదే సమయంలో ఆర్టీసీ బస్సు మీది నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషాదకర ఘటన బుధవారం ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని జిట్టిగూడెం తండాకు చెందిన లావుడ్య కుమార్(32) తన పిల్లలకు నోట్ పుస్తకాలతో పాటు ఇతర సామగ్రి కొనుగోలు చేసేందుకు సమీపంలోని నారాయణలొద్ది తండాకు చెందిన లకావత్ భిక్షపతితో కలిసి తన బైక్‌పై స్టేషన్ ఘన్‌పూర్ వచ్చాడు. పుస్తకాలు కొనుగోలు చేసిన అనంతరం మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో తిరిగి జిట్టిగూడెం తండాకు బయలుదేరాడు. ఈ క్రమంలో స్టేషన్ ఘన్‌పూర్ మోడల్ కాలనీ సమీపాన జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న బైక్‌ను ఢీకొట్టి ఇద్దరు బైక్‌తో సహా రోడ్డుపై పడ్డారు. అదే సమయంలో హనుమకొండ నుంచి జనగామ వైపునకు వెళ్తున్న ఆర్టీసీ డీలక్స్ బస్సు రోడ్డుపై పడిన వారిపై నుంచి వెళ్లింది. ఈ ఘటనలో కుమార్ అక్కడికక్కడే మృతిచెందగా భిక్షపతికి తీవ్రగాయాలయ్యాయి. ఈఘటనపై ఆర్టీసీ డ్రైవర్ అజాగ్రత్తతో బస్సు నడిపి తన భర్త మృతికి కారణమయ్యాడనే మృతుడి భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జి.వేణు తెలిపారు. కాగా, మృతుడికి ఐదేళ్లలోపు వయసున్న కుమారుడు జనార్ధన్, కుమార్తె జాను ఉన్నారు.

తిరుపతి పోలీసుల అదుపులో గాయకుడు అభిషేక్?

- రూ.14 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు ప్రచారం

కాజీపేట: కాజీపేటకు చెందిన అభిషేక్ అనే గాయకుడిని తిరుపతి పోలీసులు అదుపులోకి తీసుకుని రూ.14 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఆధ్యాత్మికతతో కూడిన పాటలు పాడటంలో మంచి పేరున్న అభిషేక్ ఇటీవల శ్రీశ్రీనివాస్ కళార్చన పేరుతో కళాబృందాలను ఏర్పాటు చేసి వారినుంచి రూ.50 లక్షల వరకు వసూలు చేసినట్లు తిరుపతి పోలీసులతోపాటు విజిలెన్స్ అధికారులకు పలువురు భక్తులు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీంతో వారు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించినట్లు తెలుస్తోంది. అదేవిధంగా భక్తులకు దర్శనాలు, లడ్డూ ప్రసాదాల పేరుతో కూడా వసూళ్లకు పాల్పడినట్లు అధికారులు గుర్తించి అభిషేక్‌ను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. అభిషేక్‌ను బుధవారం కాజీపేటలోని స్వగృహం నుంచి తిరుపతి పోలీసులు పట్టుకుని తీసుకెళ్లినట్లు కొందరు చెబుతుండగా.. లేదు పాటలు పాడేందుకు తిరుమలకు వెళ్లగా అక్కడే అరెస్ట్ చేశారన్న వాదనలు వినిపిస్తున్నాయి. మిత్రులు మాత్రం అభిషేక్ అలాంటి వ్యక్తికాదని, ఎక్కడో పొరపాటు జరిగి ఉంటుందంటున్నారు. కాజీపేట పోలీసులు మాత్రం తిరుపతి పోలీసులు తమకు సమాచారం ఇవ్వలేదని, సోషల్ మీడియాలో వచ్చిన సమాచారం మాత్రమే తెలుసని అంటున్నారు.

నవీన్‌కుమార్‌కు వైద్య సేవలందించాలి

- సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

సాక్షి స్పందన..

గీసుకొండ: రెండు కిడ్నీలు పాడైపోయి ప్రాణాపాయ స్థితిలో ఉన్న నవీన్‌కుమార్ ఆరోగ్య స్థితిపై స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. గ్రేటర్ వరంగల్ నగరం 36 డివిజన్ పుప్పాల గుట్టకు చెందిన నవీన్‌కుమార్ దీనస్థితిపై ఈ నెల 1వ తేదీన 'దాతలారా ఆపన్న హస్తం అందించండి ' అనే శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ముఖ్యమంత్రి స్పందించారు. వెంటనే బాధితుల వివరాలు సేకరించి వైద్య సేవలందించాలని అధికారులను ఆదేశించారు. దీంతో సీఎం ఆదేశాల మేరకు సీఎంఓ ఓఎస్డీ బాధితుడి తండ్రి రత్నంతో మాట్లాడి అవసరమైన వైద్యసేవలందిస్తామని తెలిపారు. కాగా, ఈ విషయంపై కలెక్టర్‌కు ఆదేశాలు జారీ కాగా బాధిత కుటుంబానికి అన్ని విధాలా వైద్య సేవలందిస్తామని కలెక్టర్ తెలిపారు.